

చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కోతకు గురైన చెక్ డ్యామ్ పరిశీలన

జైనథ్, మే 17 : మండలంలోని కంప్ట గ్రామంలో నిర్మించిన చెక్ డ్యాం ఇటీవల కోతకు గురి కావడంతో శుక్రవారం మాజీ మంత్రి జోగు రామన్న పరిశీలించారు. చెక్ డ్యాం పరిస్థితిపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ మంత్రి జోగు రామన్న దృష్టికి తీసుకురావడంతో ఆయన గ్రామానికి వెళ్లి అక్కడ చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. ఓ రైతు పొలం మీదుగా చెక్ డ్యాం కోతకు గురి కావడంతో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా మరమ్మతులు చేయించాలని సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వైద్య బాలాజీ, ఉప సర్పంచ్ బోయర్ సంతోష్, మాజీ ఎంపీపీ రౌతు రాజు, రౌతు గంభీర్, ఆరెపల్లి నానయ్య ఉన్నారు.

## బాసరలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర, మే 17 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొన్నది. దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, దర్శనం కోసం బారులు తీరారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. భక్తులతో ఆలయం, గోదావరి తీరం కిక్కిరిసింది. క్యూలైన్‌లలో గంటల తరబడి వేచి ఉండి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, హాజరైన అధికారులు

## జూన్ 10 వరకు పనులు పూర్తి చేయాలి

● పాఠశాలలను సిద్ధం చేయాలి ● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 17: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను వచ్చే నెల 10 వరకు పూర్తి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్య, పంచాయతీ, డీఆర్డీఏ, సీఈవో, మున్సిపల్ , పీఆర్, డీఎల్పీవోలు, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, పెయింటింగ్స్ ఏజెన్సీలతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులపై సమీక్షా స మావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 పాఠశాలలు ప్రారంభం కానున్నందున జూన్ 10 వరకు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సెలెక్ట్ చేసిన మొత్తం 678 పాఠశాలల్లో 668 కమిటీలు ఏర్పాటై అకౌంట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ సంబంధిత మరమ్మతులు, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్‌చాక్‌బోర్డు, తదితర మరమ్మతులను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటికి మరమ్మతు చేయాలన్నారు. పనులు చేపట్టక ముందు, చేపట్టిన తర్వాత వాటి ఫొటోలను తీసి పంపించాలన్నారు. అనంతరం మండలాల వారీగా పాఠశాలల పురోగతిని అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్, డీఈవో ప్రణీత, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.



కంది శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

## కంది శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

తాంసి, మే 17 : బీసీ నాయకురాలు గండ్రత్ సుజాతపై కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను శుక్రవారం తాంసిలో బీసీ సంఘాల నాయకులు దహనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో కంది శ్రీనివాస్ రెడ్డిపై ఎస్ఐ శివరామ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీ ఆడ బిడ్డపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల మండల నాయకులు మహేందర్, అందె అశోక్, సంతోష్, నారాయణ, రజినీకాంత్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



మావల ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎదులాపురం, మే 17 : కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డిపై సోషల్ మీడియాలో వ్యక్తిగత ఆరోపణలు చేసిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను జిల్లా కాంగ్రెస్ కమిటీ కా ర్య నిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విష్ణువర్ధన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డిపై కొందరు వ్యక్తిగత ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే సత్తాలేకనే వారిపై, వారి కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు గండ్రత్ మహేందర్, గటిక క్రాంతి, గండ్రత్ సంతోష్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మావల ఎంపీపీ సంగీత, మావల సర్పంచ్ ప్రమీలారాజేశ్వర్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గౌతమ్, దేవీదాస్, కుడ్మెత ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

# నాడు పచ్చల హారం నేడు కళావిహీనం

**‘హరితహారం’పై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం**

- ఎక్కడికక్కడ ఎండిపోతున్న మొక్కలు
- కళావిహీనంగా పల్లె, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్కులు
- ఈ ఏడాది లక్ష్యాన్ని తగ్గించిన ప్రభుత్వం
- కేసీఆర్ సర్కారులో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు

**నిర్మల్ జిల్లాలో కేసీఆర్ సర్కారులో నాటిన మొక్కల వివరాలు**

| సంవత్సరం | లక్ష్యం | నాటిన మొక్కలు |
|---|---|---|
| 2016-17 | 2100000 | 2030033 |
| 2017-18 | 3200000 | 3399243 |
| 2018-19 | 5200000 | 5173498 |
| 2019-20 | 5500000 | 5461158 |
| 2020-21 | 2600000 | 3173398 |
| 2021-22 | 2000000 | 2000000 |
| 2022-23 | 2300000 | 2300000 |
| 2023-24 | 2645000 | 3100000 |
| మొత్తం | 25545000 | 26637330 |



ఆదిలాబాద్‌లో అంకోలీరోడ్‌లో అటవీభూమిలో ఎండిపోయిన మొక్కలు

*చెట్టంటే.. సమస్త జీవరాశికి ‘ఆయువు’పట్టు.. ఆకై, కాయై, పండై ఆకలి తీర్చే కల్ప ‘తరువు’.. కలకాలం చల్లని నీడై, తోడై, ప్రాణవాయువై కాపాడే వృక్షం.. వాతావరణ సమతౌల్యతను కాపాడే కాలుష్య నియంత్రిక.. అలాంటి చెట్టును రక్షించేందుకు కేసీఆర్ సర్కారు ‘హరితహారం’ ఉద్యమంలా చేపట్టగా, జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద కార్యక్రమంగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అంతటి సత్ఫలితాలిచ్చిన కార్యక్రమం నేడు కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ప్రమాదంలో పడింది. నాడు.. పచ్చగా కళకళలాడిన ఊర్లు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌లు, ఏకో పార్కులు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లు నేడు.. ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారాయి. మొక్కలు, చెట్లన్నీ ఎండిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువవ్వడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.*

మంచిర్యాల, మే 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ‘తెలంగాణ పచ్చబడాలే.. చెట్లు లేక బోసిపోయిన పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియాలే.. పరాయి పాలనలో నిర్జీవంగా మారిన అడవులకు పునరుజ్జీవం పోయాలే.. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలే..’ అనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు హరితహారం కార్యక్రమం చేపట్టి కోట్లాది మొక్కలకు ప్రాణం పోసింది. వేల కోట్లు ఖర్చు పెట్టి పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌లు, ఏకో పార్కులు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం ఉట్టి పడేలా చర్యలు తీసుకున్నది. ఫలితంగా తెలంగాణలో అడవుల శాతం పెరిగింది. ఇంకో రెండు, మూడేళ్లు నాటిన మొక్కలను కాపాడుకుంటే అద్భుతమైన ఫలితాలు వస్తాయనుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హరితహారాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. అసలు ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో పచ్చదనం అనేది కనిపించకపోవడం గమనార్హం. కేసీఆర్ పాలనలో ఎక్కడ చూసినా కళకళలాడిన మొక్కలు నేడు ఎండిపోయి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపాలిటీ, ఫారెస్టు శాఖలు ఇప్పుడు అసలు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కొత్తవి పెట్టకపోగా.. ఉన్నవాటిని కూడా కాపాడుకునే ప్రయత్నం చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### హరితహారం అస్తవ్యస్తం

ఆదిలాబాద్, మే 16 ( నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన హరితహారం పథకం సత్ఫలితాలనిచ్చింది. ఈ పథకం పకడ్బందీగా అమలు చేయడంతో ఆదిలాబాద్ జిల్లాలో 7 శాతం పచ్చదనం పెరిగింది. అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు నిరక్ష్యం చేయడంతో పలు ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం తగ్గింది. బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది మొక్కలు నాటడంతో అటవీ విస్తీర్ణం సైతం పెరిగింది. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, చెరువు, పొలం గట్లు, ఇండ్లు, పలు చోట్ల మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేసింది. హరితవనాలు, పల్లె, పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు నాటారు. ఎనిమిది విడుతలుగా సాగిన హరితహారంలో జిల్లా వ్యాప్తంగా 5 కోట్ల వరకు మొక్కలు నాటారు.



బజార్‌హత్నూర్ : జాతర్ల పల్లెప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

### ఎండిపోతున్న మొక్కలు

కోట్లాది రూపాయల ఖర్చుతో నాటిన హరితహారం మొక్కల సంరక్షణ కాంగ్రెస్ పాలనలో కరువైంది. నాటిన మొక్కలకు ఎండాకాలంలో నీరు పోయకపోవడం, పశువులు తినకుండా సంరక్షణ చర్యలు చేపట్టక పోవడం, కొన్నింటిని నరికి వేయడంతో హరితహారం పథకం అస్తవ్యస్తంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో పకడ్బందీ ప్రణాళికలతో చేపట్టిన హరితహారం పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్ మే 17 : బీఆర్ఎస్ సర్కారు నిర్మల్ జిల్లాలో 2015 సంవత్సరం నుంచి 2023 వరకు 2 కోట్ల 66 లక్షల 37 వేల 330 మొక్కలు నాటింది. 2.55 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకు మంచి మొక్కలు నాటి సంరక్షించింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పట్టింపు లేని తనంతో ఎక్కడికక్కడ మొక్కలు ఎండిపోతున్నాయి. పల్లె ప్రకత్రి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌లు, ఏకో పార్కులు ఎండిపోయి కళావిహీనంగా మారాయి.



ఆదిలాబాద్‌లోని 6వ వార్డులో మొక్కలు లేని పట్టణ ప్రకృతివనం



నార్నూర్ : మాన్కాపూర్ రోడ్డుకు ఇరువైపులా నిర్వహణ లేక ఎదగని మొక్కలు

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి

● అకాల వర్షం బాధితులను ఆదుకోవాలి ● రైతులకు అండగా బీఆర్ఎస్ ● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, మే 17 : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న జొన్నలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తడిసిపోయాయి. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వెళ్లి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మూడు కాంటాలతోనే కొనుగోలు చేస్తున్న విషయం గమనించిన ఎమ్మెల్యే తక్షణమే కాంటాలను 6కు పెంచాలని, రెండు రోజుల్లో పూర్తి ధాన్యం కొనాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు సమస్యలపై హమాలీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇచ్చోడ : కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గుడిహత్నూర్‌లో బాధితురాలిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### రైతులకు అండగా బీఆర్ఎస్..

ఇచ్చోడ, మే 17 : తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు ఆందోళన చెందవద్దని,అన్నదాతలకు బీఆర్ఎస్ అండగా ఉండి పోరాడుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడలోని మార్కెట్ యార్డుకు వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే కలెక్టర్‌కు ఫోన్‌లో మాట్లాడి ధాన్యాన్ని వెంటనే కొనాలన్నారు. మార్కెట్ యార్డులో రెండు షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి రమేశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

### అకాల వర్షం బాధితులను ఆదుకోవాలి

గుడిహత్నూర్, మే 17: గుడిహత్నూర్ మండలంలో ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. హనుమాన్‌నగర్ కాలనీలో ఈదురుగాలులతో ఇండ్ల పైకప్పులు, షాపుల పైకప్పులు ఎగిరి పోవడంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. వారికి తక్షణ సహాయం కింద కొంత ఆర్థిక సహాయం అందజేశారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు జాదవ్ రమేశ్, జీ తిరుమల్‌గౌడ్, సంజీవ్ ముండె, జాదవ్ భీంరావ్, దోమకొండ సుధాకర్, ఎండీ గఫార్, కేంద్ర వెంకట్‌రావ్, ఆశన్న యాదవ్, సుశీల్, నక్క భూమన్న, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బయోమెట్రిక్ లేదు.. టైంకు రారు !

తాంసి, మే 17 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానం లేకపోవడంతో తహసీల్దార్‌తో పాటు సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తహసీల్ కార్యాలయాన్ని నమస్తే ప్రతినిధి సందర్శించగా పీఎస్వో తొగరి దయాకర్, జూనియర్ అసిస్టెంట్ ధారవేణి రాఘవేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఉదయం 11.20 గంటల వరకు మిగతా సిబ్బంది ఎవరూ రాలేదు. 11.21 గంటలకు సీనియర్ అసిస్టెంట్ నరేశ్, 11.30 గంటలకు తహసీల్దార్ లక్ష్మి, రికార్డు అసిస్టెంట్ బాపురావ్, 11.34 గంటలకు డీటీ జాదవ్ విష్ణు కార్యాలయానికి చేరుకున్నారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల కోసం ప్రజలు కార్యాలయం వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతి రోజూ ఇదే విధానం కొనసాగుతుందని స్థానికులు వాపోతున్నారు. పనుల కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని బాధితులు విమర్శిస్తున్నారు. ఇక్కడి రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, బయోమెట్రిక్ విధానం లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్ కార్యాలయంలో సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



ఖాళీగా దర్శనమిస్తున్న తహసీల్దార్ కుర్చీ